# సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష

- ఉమ్మడి జిల్లాలో తాజా పరిస్థితి, అనుమతులు, నిధులపై ఆరా
- వారం రోజుల్లో సమగ్ర నివేదికకు ఆదేశాలు
- నివేదిక అందాక మరోసారి పూర్తి స్థాయి సమీక్షకు నిర్ణయం
- డిప్యూటీ సీఎం భట్టి చాంబర్‌లో నిర్వహణ
- పాల్గొన్న మండలి చైర్మన్ గుత్తా, జిల్లా మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి
- హాజరైన జిల్లా ఎమ్మెల్యేలు, ఇరిగేషన్ శాఖ అధికారులు



సమీక్షలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, వివిధ శాఖల అధికారులు

నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్14(నమస్తే తెలంగాణ) : బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేకంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయా జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు. ముందుగా ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రాజెక్టులపై సమీక్ష జరిపారు. ఈఎన్‌సీతోపాటు రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొని ప్రాజెక్టుల వారీగా ప్రస్తుత పరిస్థితిని వివరించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టుల ప్రాధాన్యత వివరించారు. ప్రాజెక్టుల పురోగతి, వెచ్చించిన నిధులు, ఇంకా నిధుల అవసరాలపై వాస్తవ పరిస్థితులను అధికారులు తెలియజేయాలని ఆదేశించారు. ప్రాజెక్టుల వారీగా సంబంధిత అధికారులు సమగ్ర నివేదికలను త్వరలోనే అందజేయాలని స్పష్టం చేశారు. దీన్ని బట్టే ప్రభుత్వం నుంచి జరగాల్సిన కృషిపై స్పష్టత వస్తుందన్నారు. త్వరలోనే ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో మరోసారి రివ్యూ ఉంటుందని చెప్పారు.

**నివేదిక అందజేసిన మండలి చైర్మన్ గుత్తా**

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జిల్లా ప్రాజెక్టులపై తన వద్ద ఉన్న సమాచారంతో ఈ సందర్భంగా ఓ నివేదికను మంత్రులకు అందజేశారు. ఇందులో ప్రస్తుత స్థితి, చేసిన ఖర్చు, నిధుల అవసరాలు, ప్రాజెక్టుల ప్రాధాన్యతల గురించి ప్రస్తావించారు. ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లా సస్యశ్యామలం కావాలంటే గత ప్రభుత్వం మొదలుపెట్టిన ప్రాజెక్టుల పనులను ఆపకుండా పూర్తి చేయాలని కోరారు. పురోగతలో ఉన్న డిండి ఎత్తిపోతల, ఉదయసముద్రం-బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు, ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం, నక్కలగండి రిజర్వార్ల పనులకు ప్రాధాన్యతనిస్తూ పనులు వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. అలాగే పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల పనులపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు అవసరానికి తగ్గట్లు బడ్జెట్ కేటాయించాలని ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు సుఖేందర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. జిల్లా మంత్రులు ప్రాజెక్టులను సందర్శించి పనులు త్వరగా అయ్యేలా చూడాలని ఆయన కోరారు.

**అనుమతులు, నిధుల బాధ్యత నాదే**
**: మంత్రి కోమటిరెడ్డి**

రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతులు, వాటికి కావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న అనుమతులు, పునరావాసం, ఇతర ఇబ్బందుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాకు సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులేవీ పెండింగ్‌లో ఉండవద్దంటూ, వాటికి కావాల్సిన అటవీ శాఖ అనుమతులు, ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. అయితే అధికారులు కూడా ప్రాజెక్టుల పూర్తికి చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. అన్ని ప్రాంతాల ప్రజల అవసరాలకు సమ ప్రాధ్యామిచ్చేలా అధికారులు వ్యవహరించాలన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం, ఉదయసముద్రం పనుల్లో జాప్యం ఎందుకు జరుగుతుందని ఆయన ఇరిగేషన్ ఈఎన్‌సీని అడిగి వివరాలు సేకరించారు. ఉదయసముద్రం ఎత్తిపోతల పథకంలో మిగిలి ఉన్న 10 శాతం పనులు పూర్తయితే లక్ష పైచిలుకు ఎకరాలకు సాగునీళ్లు అందుతాయని చెప్పారు. రాబోయే రోజుల్లో తాను, జిల్లాకు చెందిన ఇరిగేషన్ మంత్రి, మండలి చైర్మన్, జిల్లా ఎమ్మెల్యేలను కలుపుకొని ప్రభుత్వం నుంచి కావాల్సిన నిధులను మంజూరు చేయిస్తామన్నారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తోపాటు జిల్లా ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వేముల వీరేశం, నలమాద పద్మావతి, కుందూరు జైవీర్‌రెడ్డి, మందుల సామేల్, బీర్ల ఐలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, బాలూనాయక్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు .

# వైభవంగా లక్ష్మీనరసింహుల తిరుకల్యాణోత్సవం



యాదగిరిగుట్టలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, డిసెంబర్14 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. గురువారం ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవ జరిపారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా కల్యాణతంతు జరిపారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖమండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా సువర్ణపుష్పార్చన జరిపించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి, దర్బార్ సేవలు చేపట్టారు. రాత్రివేళ స్వామివారికి తిరువారాధన చేపట్టి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన జరిపారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు జరిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 12 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.46,65,974 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ గీత, అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి తెలిపారు.

# రాష్ట్రపతి పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

- పనులను పరిశీలించిన కలెక్టర్ హనుమంతు కే జెండగే, చేనేత, జౌళి శాఖ అధికారులు



శ్రీరంజన్ సిల్క్ యూనిట్‌లో చిటికీనీ పరిశీలిస్తున్న కలెక్టర్ జండగే, జౌళి శాఖ అధికారులు

భూదాన్‌పోచంపల్లి, డిసెంబర్ 14 : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటనకు ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులను ఆదేశించారు. రాష్ట్ర హ్యాండ్లూమ్ కమిషనర్ వర్షిణి, రాష్ట్ర వీవర్స్ సర్వీస్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ అరుణ్‌కుమార్, రాష్ట్ర హ్యాండ్లూమ్ అడిషనల్ డైరెక్టర్ పి.వెంకటేశం, డిప్యూటీ డైరెక్టర్ ఎం.వెంకటేశంతో కలిసి గురువారం భూదాన్‌పోచంపల్లిని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. హెలిప్యాడ్ ప్రదేశం పరిశుభ్రంగా ఉండాలని, ఎక్కడైనా కరెంటు తీగలు ఉంటే వాటిని తొలగించాలని అధికారులకు సూచించారు. బాలాజీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాట్లను, పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న స్థలాన్ని పరిశీలించారు. శ్రీ రంజన్ సిల్క్ యూనిట్‌ను, టూరిజం సెంటర్‌ను సందర్శించారు. చేనేత మగ్గంపై తయారు చేస్తున్న వస్త్రాలు, చిటికీల తయారీ, రంగుల అద్దకం ప్రక్రియను తిలకించారు. కార్యక్రమంలో జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ విద్యాసాగర్, చౌటుప్పల్ ఆర్డీఓ జగన్నాథరావు, తాసీల్దార్ వీరబాయి, మున్సిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నరసింహారెడ్డి, ఎస్ఐ విక్రంరెడ్డి, ఎంఆర్ఐ వెంకట్‌రెడ్డి, టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు తడక రమేశ్, నాయకుడు ఎన్నం శివకుమార్, మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పరామర్శ





హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గురువారం నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారు కేసీఆర్ సార్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.
- నల్లగొండ/నకిరేకల్, డిసెంబర్ 14

# చదరంగం క్రీడతో ఆలోచన శక్తి పెంపు

- ఎంజీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి

రామగిరి, డిసెంబర్ 14 : చదరంగంతో ఆలోచన శక్తి పెంపొందుతుందని ఎంజీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి అన్నారు. నల్లగొండలోని ఎంజీయూ స్పోర్ట్స్‌బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐసీటీ పోటీల్లో భాగంగా గురు, శుక్రవారం జరిగే పురుషులు, స్త్రీల చెస్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీలో జరిగే క్రీడలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాశాలల నుంచి 10 మహిళా, 12 పురుషుల చెస్ జట్లు వచ్చినట్లు తెలిపారు. శుక్రవారం ఫైనల్‌లో ప్రతిభ చూపిన వారిని వర్సిటీ జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. పోటీల్లో ఎంజీయూ కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దోమల రమేశ్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మద్దిలేటి, స్పోర్ట్స్ బోర్డు అసిస్టెంట్ ప్రొఫెసర్ వై.శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ ఆర్.మురళీ, పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.